క్లుప్తంగా

నేడు, రేపు ఆధార్ శిబిరాలు

కాకినాడ: ఆధార్‌లో మార్పులు చేర్పుల కోసం సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు కాకినాడలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ప్రధానంగా పాత ఆధార్‌కార్డులలో ఉన్న పాత తూర్పుగోదావరి జిల్లా స్థానంలో కాకినాడ జిల్లాగా మార్పు చేసుకోవడంతో పాటు ఇతర మార్పులు, చేర్పులకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ అనుసంధానం, చిరునామాలు, పుట్టిన తేదీల్లో మార్పులు, ఇతర సేవలు కూడా పొందవచ్చునన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. **ప్రత్యేక శిబిరాలు ఇవే:** కాకినాడ నగరంలోని కృష్ణనగర్–2ఎ, డైరీఫారం–11ఎ, గోళీలపేట –14ఎ, యానాం రోడ్డు–15ఎ, చిన్నమార్కెట్ – 21ఎ, యాళ్లవారి వీధి–28బి, జగన్నాథపురం–30బి, బ్యాంక్‌పేట 32ఎ, గాంధీనగర్–38ఎ, రామారావుపేట–40బి, గైగోలుపాడు–50బి సచివాలయాలలో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

కోవిడ్‌తో అప్రమత్తం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కుమార్‌యాదవ్

కాకినాడ రూరల్: కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కుమార్ యాదవ్ సూచించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం దగ్గు, జలుబు, జ్వరం, ఒంటి నొప్పుల వంటి వాటితో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకారణ వర్షాలతో ఫ్లూ జ్వరాలు రెట్టింపయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మాస్క్‌ను విధిగా ధరించాలన్నారు. అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రేలంగి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 1070 మందికి కంటి పరీక్షలు


కరపలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న కిరణ్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది

కరప: స్థానిక ఎస్తేర్ పాఠశాల ఆవరణలో ఆదివారం కాకర్ల పాపారావు చౌదరి జ్ఞాపకార్థం కాకర్ల బుజ్జిబాబు, భువనేశ్వరి, రాజమహేంద్రవరం సత్యకిరణం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చైతన్య బృందం కరప, పెదపూడి పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 1070 మందికి వైద్య పరీక్షలు చేశారు. 362 మందికి కంటి శస్త్ర చికిత్సలు, 540 మందికి కళ్లద్దాలు అవసరమవుతాయని నిర్ధారించారు. అపరేషన్లు కాకినాడ కిరణ్‌కంటి ఆసుపత్రిలో చేస్తామని, వచ్చే నెల 10న కరపలో కళ్లజోళ్లను ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు బుజ్జిబాబుచౌదరి తెలిపారు. వైద్య సిబ్బందిని, పాఠశాల యజమాని డాక్టర్ నాగరాజులను నిర్వాహకులు సత్కరించారు. సత్యకిరణం చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ వి.గీతారేవతి, ప్రోగ్రాం మేనేజరు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

బోట్‌క్లబ్: తాగునీటి పైప్‌లైన్లు మారుస్తున్నందున నగరంలో సోమవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు వాటర్ వర్క్స్ డీఈ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, సూర్యారావుపేట, పాత బస్‌స్టాండ్ ప్రాంతాల్లో పాత పైపులైన్లు, కొత్త మోటార్ పంప్‌సెట్‌లు బిగిస్తున్నామని, అందువల్ల నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. గాంధీనగర్, రామారావుపేట, జీజీహెచ్, పాత బస్‌స్టాండ్, వార్ఫ్‌రోడ్డు, జడ్జి క్వార్టర్స్, సాలిపేట, వినుకొండవారివీధి, సమీప ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం తాగునీటి సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు.

కూన వ్యాఖ్యలపై యాదవుల ఆగ్రహం

కాకినాడ సిటీ: టీడీపీ నాయకుడు కూన రవికుమార్ మంత్రులు గొర్రెలు కాసే వారి కన్నా హీనమంటూ చేసిన ప్రకటన యాదవుల మనోభావాలను దెబ్బతీసేదిగా ఉందని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. పార్టీల పరంగా మీరు, మీరు విమర్శించుకోండి కానీ యాదవుల్ని ఉపమానం చేసి యాదవులను అవమాన పరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. యాదవుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా ఊరుకునేది లేదన్నారు. ఈ సంఘటన యాదవులందరినీ ఏకం చేస్తుందని నాగేశ్వరరావు అన్నారు. యాదవులంతా ఏకమై రవికుమార్ కారుకూతలను ఖండించాలని పిలుపునిచ్చారు.

అటెండర్.. చిత్రం వండర్!



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం


రాజు రాణి


మలి సంధ్యలో..


పల్లె జీవనాన్ని ప్రతిబింబించేలా..

- గీసిన ప్రతి గీతా కళాత్మకం
- డ్రాయింగ్ టీచర్ కావాలన్న కల కల్లయినా వీడని కళా తృష్ణ


వెంకటేష్

కాకినాడ రూరల్: చిత్ర కళకు ఆయన ఓ ఆభరణం. చేతి గీత చిత్తరువై మన్ననలొందుతుంది. పెన్సిల్, పెన్ను, బ్రష్ పరికరం ఏదైనా జాలువారేది మాత్రం ఓ చక్కని దృశ్య కావ్యమే అవుతుంది. వృత్తి రీత్యా అటెండరైనా ఎంతటి వారైనా ఆయన గీసిన చిత్రాలపై అటెన్షన్ పెట్టాల్సిందే. పెద్దాపురం మండలం కాండ్రకోటకు చెందిన రామకుర్తి వెంకటేష్ సుమారు 20 ఏళ్ల క్రితం కాకినాడకు వచ్చి స్థిరపడ్డారు. ప్రభుత్వ ఐటీఐలో విద్యనభ్యసించి అంబేద్కర్ దూరవిద్య కళాశాలలో బీకాం చేశారు. అలాగే ఆయనకు ఇష్టమైన డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్‌తో పాటు టీటీసీ డ్రాయింగ్ పూర్తిచేశారు. డ్రాయింగ్ టీచర్ కావాలని కలగన్నప్పటికీ, అవి నెరవేరకపోవడంతో ఏడాది క్రితం స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జోనల్ కార్యాలయంలో అటెండర్‌గా చేరారు. వృత్తి ఏదైతేనేం తన ప్రవృత్తిని సంతృప్తి పరచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సహోద్యోగులు, ఉన్నతోద్యోగులు, అధికారుల ప్రోత్సాహం, మెచ్చుకోళ్లతో తన కళా ప్రావీణ్యాన్ని అందరికీ పంచుతూ సంతృప్తి చెందుతున్నారు. అటెండర్‌గా ఉన్నప్పటికీ ఏపీఐఐసీలో జెడ్‌ఎం హరిధరరావు తనను ఎంతో ప్రోత్సహిస్తుంటారని అంటారు వెంకటేష్. పోర్ట్రైట్, లాండ్‌స్కేప్ ఇలా ఏ చిత్రానైనా అవలీలగా చిత్రిస్తుంటారు ఆయన. దేశ నాయకులు, సినీ నటులు, పల్లెజీవనం ఇలా ఎన్నెన్నో చిత్రాలు ఆయనకు మకుటం లేని కీర్తికిరీటాన్ని తెచ్చిపెట్టాయి. కళా తపస్వి కె.విశ్వనాథ్ నటించిన, దర్శకత్వం వహించిన చిత్రాల పేర్లతో ఆయనకు చిత్ర నివాళులర్పించారు. ఏపీఐఐసీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా తాను గీసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని గత ఏడాది సెప్టెంబర్ నెలలో ఆ సంస్థ ఎండీ జె.సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రికి బహూకరించడం ఎంతో ఆనందాన్నిచ్చిందంటారు చిత్రకారుడు వెంకటేష్.



స్వామి వివేకానంద


అల్లూరి సీతారామరాజు


ఇందిరాగాంధీ


ఎన్టీఆర్


కళాతపస్వి కె.విశ్వనాథ్


చిరంజీవి

డ్వామా అకౌంట్‌కు రికవరీ చేయండి

- ఉపాధి పనులపై బహిరంగ సమీక్ష
- రూ.4 వేల అపరాధ రుసుం.. రూ.9.91 లక్షల రికవరీకి పీడీ ఆదేశం


ఉపాధి పనులపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సామాజిక తనిఖీ అధికారులు

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ప్రజావేదిక నిర్వహించి, ఉపాధి పనులపై సమీక్షించారు. 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31 (15వ విడత) వరకు జరిగిన ఉపాధి పనులపై గ్రామాల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీలపై డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, అధికారులతో కలసి బహిరంగ సమీక్ష జరిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.4 వేలు అపరాధ రుసుం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖల నుంచి రూ.9,91,478 రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. వాటిని డ్వామా పీడీ అకౌంట్‌కు తిరిగి చెల్లించాలన్నారు. ఉపాధి సిబ్బంది పనితీరును ఆడిట్ అధికారులు తప్పుపట్టారు. ముందుగా ఎస్సార్పీ ఎం.నాగరాజు మండలంలో జరిగిన సామాజిక తనిఖీపై నివేదిక ఇచ్చారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల ద్వారా రూ.11,41,26,962 విలువ చేసే 825 పనులు చేయగా, ఉపాధి కూలీలకు 3,05,077 పనిదినాలు కల్పించారు. ఇందులో వారి వేతనాలకు రూ.7,60,89,115, నిర్మాణ పనుల మెటీరియల్‌కు రూ.3,80,37,846 చెల్లించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.4 వేలు, పంచాయతీరాజ్‌శాఖ పనుల నుంచి రూ.5,44,730, ఆర్‌డబ్ల్యూఎస్ పనుల నుంచి రూ.4,46,748 రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. పనుల్లో అవకతవకలపై డీఆర్పీలు పి.రాజు, డి.దుర్గాప్రసాద్ తమ నివేదికలలో పేర్కొన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఉపాధి పథకం జిల్లా అంబుడ్స్‌మన్ అధికారి ఎం.జ్యోతి, ఏపీఎస్‌ఎస్‌ఏ ఏటీ కోఆర్డినేటర్ జి.శ్రీకాంత్, ఏపీడీ పి.వసంతమాధవి, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఏపీఓ ఈ.వెంకటరమణ, జేఈ జె.నాగలోవ, టెక్నికల్ అసిస్టెంట్లు కె.ప్రకాష్, టి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ చేయూత అభినందనీయం


రోటరీ చేయూత భవనాన్ని ప్రారంభిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి

బోట్‌క్లబ్: ఖాళీగా ఉన్న రోటరీ భవనాన్ని చేయూత సంస్థ నిర్వహణకు ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమని ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. రోటరీ చేయూత భవన్‌ను ఆదివారం శేషారెడ్డి ప్రారంభించారు. చేయూత సంస్థలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు భవనం చేకూర్చడమే కాక వారి యోగక్షేమాలు పర్యవేక్షించేందుకు నిరంతరం రోటరీ సభ్యులు సహాయసహకారాలు అందిస్తామనడం రోటరీ సభ్యుల సేవా భావానికి నిదర్శనమన్నారు. నూతన భవన నిర్మాణానికి తన వంతు రూ. 50 వేలు విరాళాన్ని అందిస్తానని శేషారెడ్డి ప్రకటించారు. రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ చేయూత సంస్థకు రోటరీ బ్లడ్‌బ్యాంకు ఆధీనంలో ఉన్న హెల్త్‌కేర్ సెంటర్‌ను మూడేళ్లపాటు వినియోగించుకునేందుకు క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. చేయూత సంస్థ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం సంస్థను ఏర్పాటు చేశామని తనకు సహాయ సహకారాలు అందిస్తున్న శేషారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ మాజీ గవర్నర్లు ఎస్‌వీఎస్‌రావు, సభ్యులు వడ్డాది ఆదిత్య, చార్మినార్ వర్మ, ముత్తా నవీన్, ధనసాగర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తే కఠిన చర్యలు

హోటల్ యజమానులకు డీఎస్పీల హెచ్చరిక

కాకినాడ క్రైం: అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులను పోలీసు అధికారులు హెచ్చరించారు. కాకినాడ పోలీసులు హోటల్, లాడ్జిల యజమానులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కాకినాడ లా అండ్ ఆర్డర్, క్రైం డీఎస్‌పీలు మురళీకృష్ణారెడ్డి, రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు రూంలు కేటాయిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని, నిర్ణీత సమయాలకు లోబడి తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. వాణిజ్య సముదాయాలన్నింటిలోనూ సీసీటీవీ కెమేరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఏఎంవీఐపై దాడి బాధాకరం

- చిన్నారావుకు ఎమ్మెల్యే ద్వారంపూడి పరామర్శ
- వైద్యుల కృషి అభినందనీయం


ఏఎంవీఐ చిన్నారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రవాణాశాఖ అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావుపై కొంబరి బొండాల వ్యాపారి కత్తితో దాడిచేసిన తీరు అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఏఎంవీఐ చిన్నారావును ఆయన ఆదివారం పరామర్శించారు. సూపరింటెండెంట్ హేమలతాదేవిని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ ప్రశాంతతకు మారుపేరైన కాకినాడలో ఇటువంటి సంఘటన జరగడం ఎంతో బాధాకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఎంవీఐ చిన్నారావు చిన్నారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా ఏఎంవీఐకి సత్వర సేవలు అందించిన వైద్యులను ఆస్పత్రి ప్రతిష్ఠ పెంచేలా చేశారని వైద్యులను ఎమ్మెల్యే అభినందించారు. సుమారు 9 నుంచి 10 గంటల పాటు శ్రమించి చేసిన సర్జరీ ఆయనను ప్రాణాపాయం నుంచి తప్పించిందన్నారు.

కత్తులు వాడకుండా..

ఏఎంవీఐపై దాడి నేపథ్యంలో ఇకపై నగరంలో కొబ్బరిబొండాల వ్యాపారులు కత్తులను వినియోగించకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఆ మేరకు పోలీసు, సంబంధిత శాఖల అధికారులతో చర్చించానన్నారు. కత్తితో పని లేకుండా యంత్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి బొండాలు విక్రయించేలా చూడాలని నిర్ణయించామన్నారు. ఎమ్మెల్యే వెంట డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఆర్‌ఎంవో రాహుల్, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, పలువురు వైద్యులు ఉన్నారు. ఏఎంవీఐ డ్రైవర్‌ను కూడా ఎమ్మెల్యే ద్వారంపూడి పరామర్శించారు.

కటకట రాకుండా కట్టడి


కాకినాడ విద్యుత్‌నగర్‌లో తాజా పరిస్థితి..


కరప కొత్తపేట వీధిలో పైప్‌లైన్ బాగుచేయించి బ్లీచింగ్ చల్లిస్తున్న ఈఓ పీఆర్డీ, కార్యదర్శి

కరప/బోట్‌క్లబ్: తాగునీటి వృథాపై స్థానిక అధికారులు సత్వరం స్పందించారు.


ఇలాగైతే తాగునీటికి కటకటే..!

కాకినాడ నగరం, కరప కొత్తపేట వీధిలో పైప్‌లైన్ల లీకేజీలపై ఆదివారం సాక్షిలో 'ఇలాగైతే తాగునీటికి కటకటే' శీర్షికన ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. కరపలోని తాగునీటి పైపులైన్ లీకేజీని మండల ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్ పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయించగా, నగర పరిధిలో మున్సిపల్ వాటర్ వర్క్స్ అధికారులు పైప్‌లైన్‌ను మార్చి తాగునీటి వృథాను అరికట్టారు.

సాక్షి ఇంపాక్ట్

సమాజ ప్రగతిలో 'ద్వారంపూడి' కీలకపాత్ర

- ఎంపీ వంగా గీత
- మెగా రక్తదాన శిబిరంలో సుమారు 800 మంది రక్తదానం
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, నేతలు


శిబిరంలో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, రాగిరెడ్డి, శివప్రసన్న తదితరులు

కాకినాడ: సమాజాభివృద్ధిలో, పేదలకు బాసటగా నిలవడంలో ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి చూపిస్తున్న చొరవ అభినందనీయమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

శ్రీయువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ సహాయ నిధికి ఏటా రూ.5లక్షలు సమకూరుస్తున్న వీరభద్రారెడ్డికి కృతజ్ఞతాపూర్వకంగా ఈ శిబిరం నిర్వహించారు. ఎంపీ గీత మాట్లాడుతూ శ్రీయువసేనకే కాకుండా ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్మిక వర్గాలకు అండగా నిలవడంతో పాటు కాకినాడలో రూ.120 కోట్లతో 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణంలో వీరభద్రారెడ్డి అందించిన సహకారం ఎనలేనిదన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో తన సోదరుడు వీరభద్రారెడ్డి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా శిబిరం ఏర్పాటు చేశారని, మునుపెన్నడూ లేని విధంగా సుమారు 800 మంది రక్తదాన చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి జన్మదిన కేక్‌ను కట్‌చేసి పంచారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, గోడి సత్యవతి, రాగిరెడ్డి బన్ని తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఉగాది వేడుకలు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వు పోలీస్‌లైన్ అయ్యప్ప స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ఈ నెల 22న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఉదయం ఆలయంలో అయ్యప్పస్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నామన్నారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రఖ్యాత జ్యోతిష్య విద్వాంసులు వక్కలంక రామకృష్ణమ్మ సిద్ధాంతి పంచాంగ పఠనం ఉంటుందన్నారు.

ఉప్పాలమ్మతల్లి ఆలయంలో చండీహోమం

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఆలయాన్ని పునర్నిర్మించి మండల దీక్ష అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంబాజీపేట మండలం మొసలపల్లి వాస్తవ్యుడు, శైవాగమ పండిత, శైవాగమ ప్రతిష్ఠాచార్య, బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి సత్యనారాయణ శాస్త్రి తన బృందంతో అమ్మవారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో కుంకుమపూజ, చండీహోమం, చండీ మండపారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, చొల్లంగి దుర్గారావు, నక్కా సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

బోట్‌క్లబ్: చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర బీసీ సేన అధ్యక్షులు శొంఠి నాగరాజు అన్నారు. కాకినాడలో ఆదివారం బీసీ సేన ఆధ్వర్యంలో బీసీ జనభేరి నిర్వహించారు. రాష్ట్రంలో బీసీ నేతలకు ఎటువంటి అన్యాయం జరిగినా బీసీ సేన తరపున పోరాడతామన్నారు. రాష్ట్ర బీసీ సేన ఉపాధ్యక్షుడు యనమదల రవి మాట్లాడుతూ కొన్ని కుల వృత్తులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను బీసీ కులాలందరికీ వర్తింప చేయాలన్నారు. మాజీ మేయర్ సరోజ మాట్లాడుతూ బీసీలను కులాల వారీగా జనగణన చేపట్టాలన్నారు. బీసీ సేన రాష్ట్ర నాయకులు మల్లాడి సత్తిబాబు, కొయ్య శ్రీనుబాబు, కండిపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్లు, డీఏ మంజూరు చేయాలి

కాకినాడ రూరల్: ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ 9వేలు, డీఏ మంజూరు చేయాలని హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ అమలు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మండలంలోని ఇంద్రపాలెంలో కమ్యూనిటీ హాల్‌లో ఎస్ఏ శాస్త్రి అధ్యక్షతన రెండో మహా సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ధర్మజన్, ఉపాధ్యక్షుడు ఎ.దిగె, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, కోశాధికారి సత్యనారాయణ రాజు, నాగభూషణం తదితరులు పాల్గొని పలు డిమాండ్లు చేశారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్ఎస్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా ఎ.సత్తిరాజు ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి, కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు రెడ్డి, అశోక్, అప్పారావు, నారాయణరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని కమిషనర్ సూచించారు.

లయన్స్ రీజినల్ కాన్ఫరెన్స్


వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్ జిల్లా 316 బి రీజియన్ 4 కాన్ఫరెన్స్ వేడుకలు స్థానిక చల్లా కల్యాణ మండపంలో స్నేహామృతం పేరిట నిర్వహించారు. రీజియన్ చైర్‌పర్సన్ వడ్డాది జ్యోతి, శ్రీనివాసరాజు దంపతులు, డాక్టర్ బాదం బాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పలు సేవాకార్యక్రమాలు చేసిన అర్హులైన క్లబ్‌లకు, లయన్ సభ్యులకు వడ్డాది జ్యోతి అవార్డుల ప్రదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఐపీడీజీ ముంజులూరి విశ్వేశ్వరరావు, వీడీజీలు వేలూరి సూర్యనారాయణ ఈవీవీ ఈశ్వర కుమార్ పాల్గొన్నారు. కమిటీ చైర్‌పర్సన్ ఆర్‌వీ రమణమూర్తి, హోస్ట్ క్లబ్ పీఎస్‌టీలు టీవీఎస్ దుర్గేష్, సుధాకర్ గుప్తా, దుర్గాప్రసాద్, రీజియన్ కార్యదర్శి గీతామాధవి, సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.